# తిట్టయినా... తెలుగులోనే పలకండి

- ప్రతి స్థాయిలో తెలుగు బోధనాంశం కావాలి: వెంకయ్య
- పల్లె సీమలకు తానా: కోమటి జయరాం
- చైతన్య స్రవంతి కార్యక్రమం ఘనంగా ప్రారంభం

విజయవాడ, న్యూస్‌టుడే: తెలుగులో మాట్లాడటం అవమానంగా భావించొద్దు, మాట, ఆట, పాట, చివరకు తిట్టు అయినా ఫరవాలేదు తెలుగులోనే పలకాలని భారతీయ జనతాపార్టీ ఉపాధ్యక్షుడు ముప్పవరపు వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. విజయవాడలో ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) రెండు రోజుల పాటు చైతన్య స్రవంతి, తెలుగు వైభవం కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో వెంకయ్యనాయుడు మాట్లాడుతూ కన్నతల్లి, జన్మభూమి, అమ్మభాషను మరచిపోయినవారు మనిషులే కాదన్నారు. ఇక్కడి నుంచి బతుకుదెరువు కోసం అమెరికాకు వెళ్లి అక్కడ స్థిరపడి, మంచి స్థానాల్లో ఉన్నా తెలుగువారు మన భాషను కాపాడుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. 'అమ్మ అంటే గుండెలోంచి వస్తుంది, మమ్మీ అంటే మూతిలోంచి వస్తుంది' అన్నారు. 'ఇంగ్లిషు నేర్చుకోండి, కానీ ఇంగ్లిషు వాడిగా మారొద్దు' అన్నారు. తెలుగు నేడు కనుమరుగయ్యే పరిస్థితి రావడం దురదృష్టకరమన్నారు. తెలుగును కాపాడుకోవడం కోసం విద్యావ్యవస్థలో ప్రతి స్థాయిలోనూ తెలుగును కచ్చితంగా ఒక బోధనాంశంగా చేసి ప్రభుత్వం దీన్ని సమర్థంగా అమలు చేయాలన్నారు. విద్య కోసం అమెరికా నుంచి మన దేశానికి చదువుకోవడానికి వచ్చే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని తెలిపారు. 'అక్కడ నేర్చుకోండి, సంపాదించండి, తిరిగి ఇక్కడకు రండి... లెర్న్, ఎర్న్, రిటర్న్ అంటూ ఆయన తనదైన శైలిలో ప్రవాసభారతీయులకు పిలుపునిచ్చారు.



తానా సదస్సును ప్రారంభిస్తున్న వెంకయ్యనాయుడు. చిత్రంలో ఎంపీ రాజగోపాల్, తానా అధ్యక్షుడు జయరాం తదితరులు

**పల్లెలకెళతాం: కోమటి జయరాం...** గత రెండు రోజులుగా చంద్రగిరి కోటలో తానా నిర్వహించిన సభలకు వచ్చిన స్పందన చూసి మాకు ఆశ్చర్యం వేసిందని, పల్లె సీమలకు తానాను తీసుకెళ్లాల్సిన అవసరం ఈ కార్యక్రమం తమకు చెప్పిందని తానా అధ్యక్షుడు కోమటి జయరాం అన్నారు. భవిష్యత్తులో పల్లెసీమల్లో పెద్దఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. తెలుగు భాషను, సంస్కృతిని, మరుగున పడిన కళలను వెలుగులోకి తెచ్చి ఈ తరానికి పరిచయం చేద్దామనే తలంపుతోనే ఈ కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఎంపీ లగడపాటి రాజగోపాల్ మాట్లాడుతూ తెలుగు మాట్లాడటం, చదవడం అందరికీ వస్తున్నా ఇప్పుడు రాయడం చాలా మంది మరచిపోతున్నారని, ఇందుకు తానే ఒక ఉదాహరణ అన్నారు. కార్యక్రమంలో భాగంగా అమెరికాలో విమానాశ్రయాల రక్షణకు పరిశోధనలు చేసి పరిష్కారం కనుగొన్న అమెరికా రక్షణ రంగానికి చెందిన భారతీయ శాస్త్రవేత్త, అమెరికా ప్రభుత్వం నుంచి ఒకే ఏడాది రెండు కన్వెన్షనల్ అవార్డులు పొందిన సుబ్బారావు అనుమోలును ఘనంగా సన్మానించారు. ఆయన విజయవాడకు చెందిన వారు కావడం గమనార్హం. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మల్లాది విష్ణు, తానా ప్రెసిడెంటు ఎలెక్ట్ తోటకూర ప్రసాద్, సమన్వయకర్త బీఎస్ కోటేశ్వరరావు, తానా భారత సమన్వయకర్త గారపాటి ప్రసాద్, సాంస్కృతిక వ్యవహారాల ఇన్‌ఛార్జి విజయ ఆసూరి, ఆహ్వానసంఘం అధ్యక్షులు ముత్తవరపు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన పలు సాంస్కృతిక, జానపద కళారూపాలు, నాటికలు, సాహిత్య సదస్సులు అలరించాయి.